ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

శనివారం 11 అక్టోబరు 2025

రైతుల్లేని బజార్

● మూసి ఉన్న దుకాణాలు

● ఖాళీగా కనిపిస్తున్న స్టాల్స్

● పనిచేయని డిజిటల్ బోర్డు

6లో



ఎస్.కోటలో మెగా ఇండస్ట్రియల్ పార్కు

● రూ.531 కోట్ల పెట్టుబడి ● మంత్రివర్గం ఆమోదం

విజయనగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట మండలంలో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కానుంది. ముసిడిపల్లి, చీడిపాలెం, చినఖండేపల్లి, మూలబొడ్డవర, కిల్తపాలెం గ్రామాల్లో జిందాల్ అల్యూమినియం (జేఎస్ఎల్) పరిశ్రమ కోసం గతంలో సేకరించిన 1,166.43 ఎకరాల్లో ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి వర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. రూ.531 కోట్ల పెట్టుబడులతో బహుళ పారిశ్రామిక ఉత్పత్తులను తయారుచేసే విధంగా ఈ పార్కును నిర్మించనున్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 45 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. వ్యవసాయ ప్రాసెసింగ్, వస్త్రాలు, ఎలక్ట్రికల్ వాహనాల తయారీ, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్ వంటి ఉత్పత్తులు, అనుబంధ రంగాలు ఇక్కడ అభివృద్ధి చెందనున్నాయి. తద్వారా జిల్లా అభివృద్ధి పథంలో నడవనుంది.

● 2006 జూన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎస్.కోట మండల పరిధిలో జిందాల్ అల్యూమినియం శుద్ధి కర్మాగారం కోసం భూములు సేకరించారు. కానీ వివిధ కారణాలతో పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ఈ భూముల్లో ఎస్ఎంఎస్ఈ పార్కు ఏర్పాటు చేస్తామంటూ వైసీపీ సర్కారు హడావుడి చేసింది. రూ.1500 కోట్ల పెట్టుబడులు అంటూ ఆర్భాటం చేసింది. కానీ, ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. కూటమి ప్రభుత్వం రూ.531 కోట్ల పెట్టుబడితో భారీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంతో జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్న జిందాల్ భూములు ఇవే

బాణసంచాతో తస్మాత్ జాగ్రత్త



● బతుకులు బుగ్గిపాలు కానివ్వొద్దు ● అక్రమ నిల్వలపై తనిఖీలు అవసరం

● బహిరంగ అమ్మకాలను నిషేధించాలి ● నిబంధనలు పాటించాలి



రాజాం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో ఈ నెల 8న భారీ విస్ఫోటనం జరిగి ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, ఇలాంటి ఘటనలు జిల్లాలో జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీపావళి పండుగ ఎంతటి ప్రమోదాన్ని కలిగిస్తుందో.. అప్రమత్తంగా లేకుంటే అంతటి ప్రమాదాన్ని కూడా తెచ్చిపెడుతుంది. బాణాసంచా కాల్చడంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలే పోతాయి. ఆస్తినష్టం కూడా భారీగానే ఉంటుంది. బాణసంచా తయారీ మొదలు, నిల్వచేయడం, తరలించడం, విక్రయాలు జరపడం, వాటిని కొనుగోలు చేసి కాల్చడం వరకూ ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. తగినన్ని జాగ్రత్తలు తీసుకుంటూ కాలిస్తే కలిగే ఆనందం అంతా ఇంతా కాదు.

యంత్రాంగం అప్రమత్తం

రామవరం ఘటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈనెల 9న అధికారులతో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా అనధికార అమ్మకాలకు లైసెన్స్‌లు ఇవ్వొద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేవలం ముగ్గురు మాత్రమే లైసెన్స్‌లు కలిగి ఉన్నారని, మరో 15 మంది హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారని, వారు మాత్రమే అమ్మకాలు సాగించాలని డీఆర్వో శ్రీరామ్మూర్తి స్పష్టం చేశారు.

అనధికారిక విక్రయాలు..

జిల్లాలోని గుర్ల మండలం దేవునికనపాక పంచాయతీ గవిడిపేట, బాడంగి మండలం ఎరుకలపాకలు, చీపురుపల్లి మండలం పెదనడిపిల్లిలో మాత్రమే బాణసంచా తయారీకి అనుమతులు ఉన్నాయి. ఎస్.కోట సమీపంలోని బాణసంచా తయారీ కేంద్రాన్ని రెన్యువల్ చేయాల్సి ఉంది. అయితే, జిల్లాలో అనధికారికంగా అమ్మకాలు చేస్తున్న వారే ఎక్కువగా ఉన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి గోడౌన్‌లో స్ప్రింకర్లు ఏర్పాటు చేయాలి. నీటిపంపు సెట్లు ఎప్పటికప్పుడు మార్చాలి. అనుకోని ప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పేందుకు కనీస పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని అందుబాటులో (మిగతా 8వ పేజీలో..)

జిల్లాలో సంఘటనలు..

● గతంలో రాజాం-చీపురుపల్లి రోడ్‌లోని ఓ బాణసంచా గోడౌన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఒకరు సజీవ దహనం కాగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

● రెండేళ్ల కిందట గుర్ల మండలం దేవునికనపాక సమీపంలో మందుగుండ ఆరబెడుతుండగా గోడౌన్లకు నిప్పు అంటుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

● ఐదేళ్ల కిందట బొబ్బిలి తారకరామ కాలనీ సమీపంలో బాణసంచా పేలుడు సంభవించింది. ఈప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.

కొత్త గురువులకు పాఠశాలల కేటాయింపు

● 13న విధుల్లోకి..

సాలూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో పోస్టులు సాధించిన కొత్త గురువులకు పాఠశాలల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమైంది. డెంకాడ మండలం మోదవలస ఓయోస్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కొద్దిరోజులుగా వారికి ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 266 ఎస్జీటీలకు శిక్షణ కేంద్రంలో మాన్యువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలు, క్లస్టర్ పోస్టులను కేటాయించారు. పాఠశాల సహాయకులకు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించినందున వారికి ఈ నెల 11న పాఠశాలలను కేటాయించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 266 ఎస్జీటీలు, పాఠశాల సహాయకుల విభాగంలో సోషల్ స్టడీస్ 67, ఫిజిక్స్ 56, బయాలజీ 36, గణితం 33, తెలుగు 14, హిందీ 14, ఆంగ్లం 30, ఫిజికల్ డైరెక్టర్ 62 పోస్టులకు కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయించనున్నారు. కాగా వారంతా ఈ నెల 13న విధుల్లో చేరనున్నారు.

మెగాడీఎస్సీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 583 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టులకు 18001 మంది దరఖాస్తు చేసుకున్నారు. జూన్6 నుంచి జూలై 2 వరకు ఉపాధ్యాయ పోస్టులకు సీబీటీ ద్వారా పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రాథమిక, తుది కీలను విడుదల చేశారు. ఆగస్టులో వ్యక్తిగత మార్కులు, అనంతరం మెరిట్ లిస్ట్ విడుదల చేసి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారు. టీచర్ పోస్టులకు ఎంపికైన 578 మందితో (ఐదు పోస్టులు అభ్యర్థుల్లేక ఖాళీగా ఉండిపోయాయి.) జాబితాను గత నెల 15న ప్రకటించారు. వారికి అమరావతిలో గత నెల 25న సీఎం చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. అనంతరం వారికి డెంకాడ మండలం మోదవలసలో ఈ నెల 3 నుంచి శిక్షణ కార్యక్రమం ఆరంభించారు.



శిక్షణ పూర్తి చేసిన టీచర్‌కు ధ్రువపత్రం అందిస్తున్న డీఈవో మాణిక్యంనాయుడు

లైసెన్సు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

● బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

6లో

అడుగడుగునా గోతులు.. రోగులకు అగచాట్లు

● ఇదీ జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో పరిస్థితి

6లో



కళ్లు మూసుకున్నారా.. లక్షలు తీసుకున్నారా?

● మాకు తెలియకుండా భూమిని ఎలా ఆన్‌లైన్ చేస్తారు?

● రెవెన్యూ సిబ్బందిని నిలదీసిన బాధితులు

భోగాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ భూమి ముగ్గురు వ్యక్తుల అనుభవంలో ఉంది. వీరిలో ఇద్దరు వ్యక్తులు ఆ భూమిని ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఈ విషయం మూడో వ్యక్తికి తెలియడంతో తన కుటుంబంతో సహా భోగాపురం తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం చేరుకుని అధికారులను నిలదీశారు. తనకు తెలియకుండా మిగతా ఇద్దరి పేరిట భూమిని ఎలా ఆన్‌లైన్ చేస్తారంటూ నిలదీశారు. కళ్లు మూసుకున్నారా?.. రూ.లక్షలు తీసుకుని ఈ పని చేశారా? అంటూ ప్రశ్నించారు. బాధితుల వివరాల మేరకు.. భోగాపురం రెవెన్యూ పరిధిలో తూర్పుఖండం సర్వే నెంబరు 280/1లో 3.54 ఎకరాల భూమి కొమ్మూరు అప్పలస్వామి అనే వ్యక్తి పేరు మీద ఎఫ్‌సీవో ఉంది. అప్పలస్వామి మృతి చెందడంతో పూర్తి బాధ్యతలు ఆయన అల్లుడు కందుల రఘుబాబు చూసుకుంటున్నారు. ఈ భూమి గత కొంతకాలంగా కొయ్యపేటకు చెందిన కొయ్య అప్పలనర్సమ్మ, కొయ్య సూరప్పయ్యమ్మ, మునగల పోలమ్మ అనుభవంలో ఉంది. ఈ భూమిని ఏ విధంగానైనా ఆన్‌లైన్ చేసుకోవాలని ఈ ముగ్గురు వ్యక్తులు భావించారు. భోగాపురానికి చెందిన రెండు పార్టీలకు చెందిన ఇద్దరు నాయకులను కలిశారు. ఆ నాయకులు రెవెన్యూ అధికారులతో మంతనాలు జరిపారు. ఈ మేరకు ఈనెల 1న కొయ్య సూరప్పయ్యమ్మ, మునగల రమణ (పోలమ్మ కుమారుడు) పేరుమీద 1.77 ఎకరాల చొప్పున రెవెన్యూ అధికారులు (మిగతా 8వ పేజీలో..)




రెవెన్యూ కార్యాలయం బయట అప్పలనర్సమ్మ, పోలమ్మ కుటుంబీకుల వాగ్వాదం

వర్షాకాలం.. వాహనాలు భద్రం

● చెడిపోకుండా జాగ్రత్తలు పాటించాలి

6లో



పాత రైల్వేగేట్‌ను తెరవాలి

● మానాపురం గ్రామస్థుల రాస్తారోకో

6లో

తవ్వుకో.. తరలించుకో!

● రాజాంలో అక్రమార్కుల బరితెగింపు

● యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ

● ప్రభుత్వ స్థలాలు కూడా కబ్జా

● 130 టన్నుల మాంగనీసు స్వాధీనం చేసుకున్న అధికారులు



గార్రాజు చీపురుపల్లిలో అధికారులు స్వాధీనం చేసుకున్న మాంగనీసు (ఫైల్)

రాజాం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. సహజ వనరులను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. మాంగనీసు, గ్రావెల్, మట్టిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. గార్రాజు చీపురుపల్లిలో అక్రమ మాంగనీసు తవ్వకాలను అధికారులు ఇటీవల గుర్తించారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 130 టన్నుల మాంగనీసును స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ ప్రాంతంలో మాంగనీసు తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయన్న అనుమానాలు ఉన్నాయి. దీని వెనుక పెద్ద తలకాయలే ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. రాజాం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గృహ నిర్మాణాలతో పాటు ఇతరత్రా పనులు జరుగుతుండడంతో మట్టికి గిరాకీ ఏర్పడింది. దీంతో గ్రామాల్లో చోటా నాయకులు, ట్రాక్టర్ యజమానులు సిండికేటుగా మారి మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఎక్కడా అనుమతులు తీసుకున్న దాఖలాలు లేవు. అడుగుల మేర లోతులో మట్టిని తీసి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ లోడు ధర రూ.1000పై మాటే. రోజుకు పదుల సంఖ్యలో వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు. ఏకంగా యంత్రాలు పెట్టి తవ్వేస్తున్నారు. దీంతో ఏ చెరువు చూసినా గోతులమయంగా మారిపోయింది.

ప్రభుత్వ స్థలాలకు రక్షణేదీ?..

రాజాం పట్టణం విద్య, వైద్యం, వర్తక, వాణిజ్యంలో చాలా అభివృద్ధి సాధిస్తోంది. దీంతో పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదునుగా అక్రమార్కులు ప్రభుత్వ (మిగతా 8వ పేజీలో..)

అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలుంటాయా?

● బొబ్బిలి మునిసిపాలిటీలో 300 పైగా గుర్తింపు

● యథేచ్ఛగా నీటి చౌర్యం

● గత పదిహేనేళ్లుగా పట్టించుకోని అధికారులు

● మళ్లీ తెరపైకి వీటి ప్రస్తావన

● తొలగించాలంటున్న కౌన్సిలర్లు

బొబ్బిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో అక్రమ కుళాయి కనెక్షన్ల భాగోతం మళ్లీ తెరపైకి వచ్చింది. వీటిని తొలగించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. వాస్తవానికి ఇలాంటి అక్రమ కుళాయి కనెక్షన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని గడిచిన మూడు, నాలుగు పాలకవర్గాల హయాం నుంచి అధికారులు బీరాలు పలుకుతున్నారే తప్ప ముందడుగు వేసి దాఖలాలు లేవు. ఈసారైనా చర్యలు తీసుకుంటారో? లేదో? వేచిచూడాలి.

ఇదీ పరిస్థితి..

మునిసిపాలిటీలోని 31వార్డుల్లో 300కి పైగా అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నట్లు సచివాలయ సిబ్బంది చేపట్టిన సర్వేలో తేలింది. వార్డుకు సగటున పది చొప్పున అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. మల్లమ్మపేట, గొల్లవీధి, గొల్లపల్లి తదితర వీధుల్లో 60 వరకు అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు బయటపడింది. వీటి ద్వారా మునిసిపాలిటీకి ఒక్క రూపాయి ఆదాయం రావడం లేదు సరికదా తిరిగి ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోంది. అధికారిక కుళాయి కనెక్షన్లు ఉన్న వారు నెలకు రూ.90 చొప్పున మునిసిపాలిటీకి పన్ను చెల్లిస్తున్నారు. కానీ, అక్రమ కుళాయి (మిగతా 8వ పేజీలో..)





బొబ్బిలిలోని ఓ వార్డులో కుళాయికి విద్యుత్ మోటార్‌ను అమర్చిన దృశ్యం, మరో వార్డులో అక్రమ కుళాయి కనెక్షన్

వర్షాకాలం.. వాహనాలు భద్రం

● చెడిపోకుండా జాగ్రత్తలు పాటించాలి



విజయనగరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):

ఇది వర్షాకాలం. జిల్లాలో తరచూ వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఇలాంటప్పుడు ద్విచక్ర వాహనాల విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా చెడిపోయే ప్రమాదం ఉంది. విడిభాగాలు పాడైతే వ్యయం భరించాల్సి ఉంది. వర్షాల సమయంలో జాగ్రత్తలు పాటిస్తే వాహనం మంచి కండిషనల్‌లో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

చైన్ స్ప్రాకెట్..

దిచక్రవాహనాలకు చైన్లకు మూతలు ఉన్నా, వాటి మధ్య సందులున్నా, చైన్ కవరుకు కేప్ లేకున్నా నీరుచేరుతుంది. ఇది చైన్‌లో నుంచే ఆయిల్‌ను నిర్వీర్యం చేస్తుంది. ఫలితంగా చైన్‌స్ప్రాకెట్‌లో శబ్దం మొదలై ఒదులు అవడంతో పాటు జాయింట్ల మధ్య దూరం పెరుగుతుంది. చైన్ స్ప్రాకెట్ మార్చాలంటే కనీసం రూ.1500 ఖర్చు అవుతుంది. వర్షంలో ప్రయాణించాక చైన్‌లో తడి ఉంటే మెకానిక్‌తో ఆయిల్ వేయించడం కానీ, గ్రీజు రాయించడం కానీ చేయాలి.

సైలెన్సర్..

నీరు, బురద కారణంగా సైలెన్సర్ చిల్లులు పడుతుంది. దీని అడుగు భాగంలో ఏ మాత్రం బురద లేదా మట్టి పట్టినా శుభ్రం చేయాలి. లేదంటే తుప్పు పడుతుంది. సైలెన్సరు మార్చాలంటే వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుంది.



మూతలేని టూవీలర్ చైన్ స్ప్రాకెట్

ఇంజను..

వర్షాకాలంలో గుంతల రోడ్లపై ప్రయాణించేటపుడు సైలెన్సరులోకి నీరుచేరి ఇంజనులోకి ప్రవేశిస్తుంది. తద్వారా ఇంజను తరుచూ మొరాయిస్తుంది. ఒక సారి ఇంజను విప్పాలంటే దెబ్బతిన్న విడిభాగాల మార్పిడితో పాటు సర్వీసింగుకు కనీసం వెయ్యిరూపాయలు వరకు ఖర్చువుతుంది. సాధ్యమైనంతవరకు గోతుల్లోంచి కాకుండా కాస్త వేగాన్ని తగ్గించి పక్కనుంచి వెళ్లాలి.

డిస్కులు..

ప్రస్తుతం డిస్కు బ్రేకులున్న ద్విచక్ర వాహనాలు సంఖ్య పెరుగుతోంది. డిస్కు జీవిత కాలం కనీసం 30వేల కిలో మీటర్లు. వర్షాకాలంలో బురద, ఇసుక, మట్టి చేరి త్వరగా పాడవుతాయి. బ్రేకు వేసినప్పుడు శబ్దం వస్తుంది. దీన్ని మార్చుకోవాలంటే కనీసం 1250 రూపాయలు ఖర్చువుతుంది. వాహనం నీటిలో నుంచి వెళ్లినపుడు సాధ్యమైనంతవరకు డిస్కుబ్రేకును వాడకపోవడం మంచిది. ప్రయాణం ముగిశాక డిస్కుకు ఉండే కార్కు సందుల్లో నీటితో కడిగి తుడవాలి.



టూవీలర్ ఇంజను

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ద్విచక్ర వాహనం వర్షంలో ప్రయాణించగానే ఇంజను కింది భాగంలో మట్టిలేకుండా శుభ్రంగా తుడవాలి.
- బైకుస్టాండ్ స్ప్రింగులలో మట్టిచేరితే యాక్షను ఉండదు. స్ప్రింగ్ కొక్కేల వద్ద ఆయిల్ వేయాలి.
- పెట్రోల్ ట్యాంకు మూత సరిగా లేకుంటే నీరు కార్బొరేటర్‌లోకి చేరుతుంది.
- సీటు కవర్లు తడిస్తే వేగంగా పాడవుతాయి. తడవకుండా చూసుకోవాలి.
- నీటితో యాక్సిలేటర్లు, క్లచ్ లీవర్లు అంత సులభంగా పనిచేయవు. వాటి తీగలకు గ్రీజు రాస్తే వదులుగా మారుతాయి.
- బైకులను బయట వదలిపెట్టాల్సి వస్తే తప్పనిసరిగా కవర్లు కప్పడం మంచిది.

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి..

వర్షాకాలంలో దిచక్రవాహనాలు, కార్లు డ్రైవ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలి. వాహనాలను వర్షంలో తడవకుండా ఉండేటట్లు చూడాలి. వాహనం తీసిన కొద్ది సమయంలో నెమ్మదిగా వెళ్లాలి. ఈ కాలంలో రోడ్లు తడిచి ఉంటాయి. టైర్ గ్రిప్ తక్కువగా ఉంటుంది. సడన్ బ్రేక్ వేస్తే ప్రమాదాలు జరుగుతాయి. నెమ్మదిగా వెళ్లాలి. వాహనాలను తరుచుగా చెక్ చేసుకోవాలి.

-సోమేశ్వరరావు, బైక్ మెకానిక్



ఆర్అండ్‌బీ రైతుబజారు



రైతులు లేక మూతపడిన స్టాల్స్

రైతుల్లేని బజార్

● మూసి ఉన్న దుకాణాలు
● ఖాళీగా కనిపిస్తున్న స్టాల్స్ ● పనిచేయని డిజిటల్ బోర్డు

విజయనగరం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు బజార్లపై అధికారుల పర్యవేక్షణ కరువై పోవడంతో అక్కడ దళారుల హవా నడుస్తోంది. గుర్తింపుకార్డులు ఉన్న రైతులు లేదా వారి కుటుంబ సభ్యులు రైతుబజార్లలో స్టాల్స్ నిర్వహించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా నడుస్తోంది. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ కూడలి వద్ద ఉన్న రైతుబజారులో శుక్రవారం రైతులే కనిపించలేదు. స్టాల్స్ ఖాళీగా కనిపించాయి. మరికొన్ని షాపులు మూసివేశారు. ఉన్నవారు కూడా గుర్తింపు కార్డులు లేకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ రైతుబజార్‌లో 106 మంది రైతులకు స్టాల్స్ నిర్వహణ కోసం అనుమతి ఇచ్చారు. అద్దె లేకుండా 12 మందికి స్టాల్స్ ఇవ్వగా.. నెలకు రూ.2వేల అద్దె ప్రకారం 50మందికి, నెలకు రూ.వెయ్యి అద్దె చొప్పున 56 మందికి ఇచ్చారు. ప్రతినెలా మార్కెటింగ్ శాఖకు రూ.2.64,500 అద్దె వసూలు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కానరాని సదుపాయాలు..

రైతుబజార్‌లో డిజిటల్ బోర్డు మూలకు చేరి నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే లేరు. అలాగే రైతుబజారు తెరవగానే తాజా కూరగాయలు నగరంలోని హోటల్స్‌కు, కేటరింగ్ సిబ్బందికి రిక్షాలపై తరలిస్తారని స్థానికులు చెబుతున్నారు. ఆతరువాత మిగిలిన కూరగాయలను మాత్రమే విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం. ఉదయం 6గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఉండాల్సిన ఇక్కడి కొందరు అధికారులు, సిబ్బంది హాజరు వేసుకుని ఇతర పనులు చూసుకుంటున్నట్లు సమాచారం. ఇదే విషయమై మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్ వద్ద ప్రస్తావించగా రైతుబజార్లలో బినామీలు స్టాల్స్ నిర్వహించకూడదన్నారు. గుర్తింపు కార్డులు లేకుండా వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతుబజార్‌లో స్టాల్స్ ఖాళీగా ఉన్నట్లు తమ దృష్టికి రాలేదని తెలిపారు.

లైసెన్సు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

● బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

బాడంగి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. లైసెన్సు లేకుండా మతాబులు తయారు చేస్తే ప్రాణాపాయం కలుగుతుందని, ఎవరైనా తయారు చేస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. అలాగే సైబర్ వలలో పడి ఇటీవలచాలా మంది మోసపోతున్నారని, సంబంధం లేని వేరెవరైనా ఫోన్లు చేసి బ్యాంకు వివరాలుగానీ, ఆధార్ వివరాలుగానీ అడిగితే ఇవ్వకూడదని కోరారు. ఇటీవల బొబ్బిలిలో కూడా ఇలాంటి మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కాలేజీల్లో, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ నారాయణరావు, ఎస్ఐ తారకేశ్వరరావు ఉన్నారు.



మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

ఓటర్ల సవరణ దరఖాస్తులు పరిష్కరించాలి

● డీఆర్వో శ్రీనివాస్ మూర్తి

విజయనగరం కలెక్టరేట్ అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) ఓటర్ల జాబితాలో సవరణకు వచ్చిన దరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించాలని డీఆర్వో శ్రీనివాస్ మూర్తి కోరారు. శుక్రవారం విజయనగరంలోని తన చాంబర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో క్లెయిమ్స్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ క్లెయిమ్స్‌పై ఏఈఆర్‌వో, బీఎల్‌వోలతో మాట్లాడాలని, ఏరోజు క్లెయిమ్స్ ఆ రోజే పరిష్కరిస్తే పెండింగ్ ఉండవని తెలిపారు. శుక్రవారానికి జిల్లాలో ఏడురోజులు దాటిన క్లెయిమ్స్ 28 ఉన్నాయని చెప్పారు. రాజాం, బొబ్బిలి, చీపురుపల్లిలో ఎటువంటి పెండింగ్‌లో లేవని తెలిపారు. ఏడురోజుల లోపల క్లెయిమ్స్ కోసం వచ్చిన దరఖాస్తులను ప్రాసెస్ చేయకపోతే ఈఆర్వో నుంచి వివరణ కోరాలని ఎన్నికల కమిషన్ సూచించిందని తెలిపారు. వారి వివరణను ప్రతి నెలా ఐదో తేదీ నాటికి కలెక్టరు నివేదిక పంపవల్సి ఉంటుందని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన పనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌మూర్తి



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

ఏ ఒక్కరైతూ నష్టపోకూడదు: జేసీ

విజయనగరం కలెక్టరేట్ అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) ఏ ఒక్క రైతూ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. ప్రత్తి కొనుగోళ్లపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం విజయనగరంలోని తన చాంబర్ లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి రైతు నష్టపోకుండా గిట్టుబాటుధరను అందించేలా చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. ప్రత్తి పంటపై ఈ-క్రాప్ కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటా రూ 8,110గా నిర్ణయించందని తెలిపారు. ఈ విషయాన్ని సేవ కేంద్రాల ద్వారా ప్రచారం చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రత్తి పంటను క్వింటాకు రూ 8,110 చొప్పున కొనుగోలు చేయడానికి త్వరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీసీఐ రూపొందించి కాపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను రైతులు డౌన్ లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ముందుగా రాజాంలోని ఏఎంసీ నుంచి ప్రత్తి కొనుగోలు చేపట్టి, అక్కడి నుంచి రామభద్రపురంలో ఉన్న జిన్నింగ్ మిల్లుకు తరలిస్తామని తెలిపారు. సమావేశంలోని మార్కెటింగ్ ఏడీబి రవికిరణ్ పాల్గొన్నారు.

వర్షం నీరుచేరి.. దోమలకు నిలయంగా మారి..

● ఇదీ విజయనగరం కలెక్టరేట్ వద్ద పరిస్థితి

విజయనగరం టౌన్, అక్టోబ రు10 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కలెక్టరేట్ చుట్టూ వర్షం నీరు చేరడంతో ఉద్యోగులు, అర్జీ దారులు అగచాట్లకు గురవుతున్నారు. ఏపాటి వర్షం కురిసినా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకి నీరుచేరి నిల్వఉంటోంది. రోజుల తరబడి నిల్వ ఉండడం వల్ల దోమలకు నిలయంగా మారుతోంది. వర్షం నీరు రోడ్లపై ఉండ డం వల్ల కార్యాలయంలోకి వెళ్లేందుకు ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. కార్యాలయంలోని ఆడిటోరియం వెనుకభాగంతో పాటు క్యాంటీన్‌కు వెళ్లే మార్గంలో చెరు వులను తలపించేలా నీరు చేరుతోంది. జిల్లాకు సంబంధించి నిత్యం వివిధ అంశాలపై సమీక్షలు జరగడం, ప్రజాప్రతినిధులు, వీఐపీలో రద్దీగా ఉండే ప్రాంగ ణంలో నీరు నిల్వఉండడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. తక్షణమే కలెక్టరేట్ ఆవరణలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఆవరణలో వర్షపునీరు

సమన్వయం లేక.. మరమ్మతులకు నోచుకోక

● రెండు సెక్షన్లు మధ్య నలిగిపోతున్న వాహనచోదకులు ● ఇదీ పాలకొండ-రాజాం రహదారి పరిస్థితి

రేగిడి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలకొండ-రాజాం రహదారి నిర్వహణపై రెండు ఆర్అండ్‌బీ సెక్షన్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వాహనచోదకులకు అగచాట్లు తప్పడం లేదు. రెండు సెక్షన్ల మధ్య వాహనచోదకులు నలిగిపోతున్నారు. ఈ మార్గంలో ఒడిశాకు వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటోంది.



రాజాం సెక్షన్‌లో మజ్జి రామునిపేట వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

ఇదీ పరిస్థితి..

పాలకొండ-రాజాం రహదారి విజయనగరం, పార్వతీపురమన్యం జిల్లాల ఉమ్మడి జిల్లాల సరిహద్దులకు ఆనుకుని ఉంటుంది. ఒడిశాలోని పలు ప్రాంతాలకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాలి. అ రహదారి రెండు జిల్లాల్లో రెండు సెక్షన్ల పరిధిలో ఉంది. ఉమ్మడిజిల్లాలో ఈరూట్ 21 కిలోమీటర్లు ఉండేది. పాలకొండ నుంచి చిన్నయ్యపేట సెంటర్ వరకు ఉన్న తొలి ఆరు కిలోమీటర్లు మన్యం జిల్లాలోని పాలకొండ ఆర్అండ్‌బీ సెక్షన్ పరిధిలోకి వస్తుంది. చిన్నయ్యపేట నుంచి రాజాం వరకు ఉన్న 15 కిలోమీటర్లు విజయనగరం జిల్లాలోని రాజాం ఆర్అండ్‌బీ సెక్షన్ పరిధిలో ఉంది. అయితే ఈ రెండు సెక్షన్లు అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఒకేసారి మరమ్మతులకు నోచుకోకపోవడం వల్ల వాహనచోదకుల పాలిటా శాపంగా మారుతోంది.

ఒక కిలోమీటరు మేర మరమ్మతులు..

పాలకొండ ఆర్అండ్‌బీ సెక్షన్‌లో ఇటీవల సంకిలి వంతెన దగ్గరి నుంచి చిన్నయ్యపేట వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ కేవలం కిలోమీటరు వరకూ మాత్రమే పనులు జరగడం తో వాహనచోదకులు పెదవివిరిస్తున్నారు. మిగతా 15 కిలోమీటర్ల రోడ్డు పనులకు మోక్షం లభించలేదు. ఆ ప్రాంతం సాంకేతికంగా ఉమ్మడి జిల్లా సరిహద్దులో ఉండడం, మరమ్మతులకు ఒకేసారి నిధులు మంజూరుకాకపోవడంతో వాహనచోదకులకు కష్టాలు తప్పడంలేదు.

అర్ధాంతరంగా నిలిచిన పనులు..

పాలకొండ-రాజాం రహదారిలో 21కిలోమీటర్లు పొడవునా గల మార్గంలో పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. వైసీపీ హయంలో ఈరూట్‌కు సగం రోడ్డుకే నిధులు మంజూరయ్యాయి. అయితే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తాజాగా కూటమి ప్రభుత్వం పాలకొండ సెక్షన్ పరిధిలో రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపడుతోంది. రాజాం ఆర్అండ్‌బీ సెక్షన్ పరిధిలో మరమ్మతులపై కదలిక లేదు. ప్రస్తుతం ఈరూట్‌లో మజ్జిరామునిపేట, ఉంగరాడమెట్ట వద్ద భారీగుంతలు ఏర్పడడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

బిల్లుల సమస్య వల్ల పనులు జరగడం లేదు..

పాలకొండ- రాజాం రోడ్డు ఉమ్మడిజిల్లాల పరిధిలో ఉందని రాజాం ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు తెలిపారు.తమ పరిధిలో ఉన్న 15 కిలోమీటర్లకు బిల్లుల సమస్య వల్ల రోడ్డు పనులు జరగడం లేదని చెప్పారు. పాలకొండ సెక్షన్ పరిధిలో ఉన్న ఆరు కిలోమీటర్లకు నిర్వహణ చర్యలు చేపట్టినట్లు కనిపిస్తోందని, ఆ సెక్షన్ తన పరిధిలోకి రాదని తెలిపారు.

అడుగడుగునా గోతులు.. రోగులకు అగచాట్లు

● ఇదీ విజయనగరంలోని జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో పరిస్థితి

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి: విజయనగరంలోని జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో అడుగడుగునా గోతులమయం కావడంతో రోగులు అగచాట్లకు గురవుతున్నారు. ఇక్కడకు పార్వతీపురంతోపాటు విజయనగరం జిల్లాలోని వందలాది మంది వైద్యంకోసం వస్తుంటారు. దీంతో నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. అయితే ఏళ్ల తరబడి ఆస్పత్రి ఆవరణలో రోడ్లపై దృష్టిసారించకపోవడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడకు వచ్చే రోగులు, బంధువులు రోడ్లపై గోతుల్లో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఓపీ గది వద్ద నుంచి జిల్లా వైద్యాధికారి కార్యాలయం వరకూ వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా మారింది. వర్షం కురిస్తే చెరువును తలపించేలా నీరు చేరుతోందని పలువురు రోగులు వాపోతున్నారు. ఆస్పత్రి ఆవరణలో వాహనాలపై రాకపోకలు సాగించాలంటే హడలిపోతున్నారు. గోతులు ఏర్పడి నెలలు గడుస్తున్నా కనీస మరమ్మతులు చేయడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా గోతులు పూడ్చాలని పలువురు రోగులు కోరుతున్నారు.



జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో గోతులు ఏర్పడిన దృశ్యం

25లోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ నమోదు ఈనెల 25లోగా పూర్తి చేయాలని కలెక్టరు రామసుందర్ రెడ్డి ఆదేశించారు.శుక్రవారం తన చాంబర్‌లో ఆయా శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రక్షిత తాగునీటి సరఫరాపై పని చేస్తున్న అన్ని స్కీములపై ఎస్‌వోసీని తయారు చేసి వెంటనే సమర్పించాలని చెప్పారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సూపర్ జీఎస్టీ సేవింగ్స్ క్యాంపెన్‌లో భాగంగా రెండు రోజులపాటు ఎలక్ట్రానిక్ పరికరాల ఎగ్జిబిషన్ కం సేల్ ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని కోరారు.

పాత రైల్వేగేట్‌ను తెరవాలి

● మానాపురం గ్రామస్థుల రాస్తారోకో

దత్తిరాజేరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానాపురం వద్ద పాత రైల్వేగేట్‌ను తెరవాలని గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించిన నేపథ్యంలో కింద ఉన్న ట్రాక్ వైపు ఉన్న రహదారిని మూసివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలు సాగించేందుకు అనువైన స్థలం కావడంతో దీనిని తెరవాలని మానాపురం గ్రామస్థులు రోడ్డుపై నిరసన తెలిపారు. బ్రిడ్జి దాడి వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోందని వాపోయారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, అత్యవసర పనులపై వెళ్లాల్సిన సమయంలో ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోయారు. రైల్వే అధికారులు స్పందించి పాత రైల్వేగేట్‌ను తెరవాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు గేదెల మంగమ్మ, గేదెల రామసత్యం పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న మానాపురం గ్రామస్థులు

పర్యవేక్షణకు నోచుకోక.. ప్రణాళికలు లేక

- వేధిస్తున్న మురుగు, వరద సమస్య
- ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- ఇదీ రాజాంలో పరిస్థితి

రాజాం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి)

రాజాం మునిసిపాలిటీలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రణాళికలు రూపొందించపోవడం వెరసి పట్టణ వాసులకు మురుగు, వరద నీటి సమస్య వేధిస్తోంది. ఫుట్ పాత్‌ల ఆక్రమణ పుణ్యమాని చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమ యవుతున్నాయి. వంగర, రేగిడి, సంతకవిటి తదితర మండలాల నుంచి పనులపై రాజాం వచ్చేవారు వర్షం కురిస్తే అగచాట్లకు గురవుతున్నారు. పది నిమిషాలపాటు వర్షం కురిస్తే రెండు కిలోమీటర్ల మేర మెయిన్‌రోడ్డు మీదుగా రెండడుగుల ఎత్తులో మురుగునీరు చేరుతోంది. పట్టణంలో నాలుగైదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

వర్షం కురిస్తే మెయిన్‌రోడ్డుపైకి నీరు..

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థపై మునిసిపల్ యంత్రాంగం పర్యవేక్షణ కొరవడింది. మురుగునీటి సమస్య తలెత్తగానే తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారన్న విమర్శలొస్తున్నాయి. ప్రధాన డ్రైనేజీలు ఆక్రమణలకు గురికావడం, కాలువలపై నిర్మాణాలు చేపట్టడం, ఫుట్‌పాత్ కనిపించకుండా ఆక్రమించి షాపుల ఏర్పాటు చేయడం వల్ల కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరంతా మెయిన్‌రోడ్డుపైకి చేరుతోంది.

ఇళ్లలోకి మురుగు..

బొబ్బిలి రోడ్డులోని అమ్మవారికాలనీ, ఆదర్శనగర్ కాలనీ, టీచర్స్ కాలనీ, మెంటిపేట ఎస్సీకాలనీ, రెల్లివీధి, మాదిగవీధి, చాకలివీధి, గొల్లవీధి, మల్లయ్యపేట, తదితర ప్రాంతాలతో పాటు చీపురుపల్లి రోడ్డులోని పలు వీధుల్లోని కాలువల్లోని మురుగునీరంతా మెయిన్ రోడ్డుకు అనుసంధానం చేసే కాలువలో వచ్చి చేరుతోంది. వీటికితోడు మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న మొండివీధి, సత్యనారాయణ పురం, తెలగావీధి, కొండకవీధితో పాటు మాధవ బజార్ ప్రాంతాల్లోని కాలువల్లోని మురుగునీ రు మెయిన్ కాలువలో చేరుతోంది. సాధారణ రోజుల్లో సమస్య తీవ్రత లేకపోయినా వర్షం కురిస్తే కాలువలన్నీ పొంగి ప్రధాన కాలువ నిండిపోయి మెయిన్ రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. చేరిన మురుగునీరు బొబ్బిలి జంక్షన్ నుంచి నాలుగురోడ్ల కూడలి మీదుగా ఒకటిన్నర కిలోమీటర్లు మెయిన్‌రోడ్డు మీదుగా ప్రవ హించి శ్రీకాకుళం రోడ్డులోని సప్తగిరికాలనీ వద్ద కొంత నిలిచిపోగా, అక్కడి నుంచి మరో అర కిలోమీటరు మేర రోడ్డుపైనే ప్రవహించి, ఇదే రోడ్డులోని పెట్రోల్ బంక్ వరకూ రోడ్డుపైనే నిలిచిపోతోంది. ఫలితంగా వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా మెయిన్‌రోడ్ మీదుగా నడవ డానికి అగచాట్లు తప్పడం లేదు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి పాలకొండ రోడ్డులోగల డోలపేట వెళ్లేవరకూ రోడ్డు అధ్వానంగా తయారైంది. సప్తగిరి కాలనీతో పాటు మల్లిఖార్జున కాలనీలోని ఏడులైన్లలోనూ చినుకుపడితే ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతోంది.

ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు..

పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. ఈశ్వరనారాయణ కాలనీలోని ఆరులైన్లతో పాటు బాబానగర్ కాలనీలోని ఐదు లైన్లలో ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం, కాలువలు నిర్మించకపోవడంతో వర్షం కురిస్తే వెళ్లలేని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ఎల్ఐసీ కార్యాలయం వెనుక ప్రాంతంతో పాటు సారథిరోడ్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.


పాలకొండ రోడ్డులో మురుగు నీరు (ఫైల్)

పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి..

పారిశుధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలని రాజాం మునిసిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు కోరారు. కాలువల్లో నిర్మాణాల చెత్తతో పాటు వ్యర్థాలను వేస్తున్నారని, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఇళ్లను నిర్మిస్తు న్నారని చెప్పారు. షాపులు కూడా ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయడం పారిశుధ్య కార్మికులకు వీలు కావడం లేదని తెలిపారు. బజార్ ప్రాంతంలో వ్యాపారులు సైతం చెత్తను కాలువల్లో వేస్తున్నారని చెప్పారు. ఫలితంగా వర్షం కురిసే సమయంలో మురుగునీరు సజావుగా ముందుకు సాగే వీల్లేక రోడ్డెక్కుతోందని చెప్పారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భార్యను కడతేర్చి.. అగ్నిప్రమాదంగా చిత్రీకరించిన భర్త

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న కోరాపుట్ పోలీసులు

సాలూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన ఓ మహిళను ఒడిశాలోని కోరాపుట్‌లో ఆమె భర్త కానిస్టేబుల్ హతమార్చి అగ్నిప్రమాదంగా చిత్రీకరించాడు.శుక్రవారం పోలీసులు ప్రశ్నించడంతో హత్యగాతేలింది. స్థానికులు, హతురాలి తండ్రి తరణి పండా కథనం మేరకు... శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన ప్రియాంక పండాను ఒడిశాలోని నవరంగపూర్ జిల్లా డాబుగాంనకు చెందిన శివశంకర్ పాత్రో గతేడాది జూలై 11న పెళ్లి చేసుకున్నాడు. వివాహ సమయంలో వధువు తండ్రి తరణి పండా అల్లునికి రూ.2 లక్షలు, 12 తులాల బంగారం కానుకలుగా ఇచ్చారు. శివశంకర్ పాత్రో ఐఆర్‌బీలో కానిస్టేబుల్‌గా కోరాపుట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన బుధవారంరాత్రి అత్తమామలకు ఫోన్‌చేసి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో తన భార్య ప్రియాంక పండా మరణించినట్టు సమాచారం ఇచ్చాడు. అప్పటికి కొద్దిసేపటి క్రితమే కూతురుతో తండ్రి తరణి పండా ఫోన్‌లో మాట్లాడారు. వారు కోరాపుట్ వచ్చి కూతురు మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. కోరాపుట్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. అగ్నిమాపకదళం వారు సైతం అగ్నిప్రమాదం జరిగిన తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు నిందితుడు శివశంకర్ పాత్రోను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో రాడ్‌తోకొట్టడంతో ఆమెచనిపోయిందనితేల్చారు. ఈ ఘటనపై కోరాపుట్ సీఐ సత్యానంద్ పాత్రో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలబావిలో మృతదేహం గుర్తింపు

చీపురుపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):పత్తికాయవలసకు చెందిన ఎలకల రాము (26)మృతదేహాన్ని నేలబావిలో గుర్తించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పత్తికాయవలసకు చెందిన రాము మూడేళ్లుగా పుర్రేయవలస సమీపంలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం రాము బట్టీలో పని ముగించుకొని ఇంటికి బయలుదేరాడు. బాగా పొద్దుపోయినా ఇంటికి చేరకపోవడంతో బట్టీలో అదనపు పనిలో ఉన్నట్లు కుటుంబసభ్యులు భావించారు. అయితే, రాత్రికూడా ఇంటికి చేరకపోవడంతో, యజమానిని వాకబుచేశారు. విధులు ముగించుకొని సాయంత్రమే వెళ్లిపోయాడని యజమాని చెప్పడంతో రాము కోసం కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈక్రమంలో ఇటుక బట్టీ సమీపంలో ఉన్న నేలబావి సమీపంలో చెప్పులు పడిఉండడాన్ని గమనించిన స్థానికులకు రాము బావిలో శవమై కనిపించాడు. కుటుంబ భారం మోయలేకపోవడం వల్ల గాని, ప్రేమ వ్యవహారంగాని రాము ఆత్మహత్యకు కారణమై ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. రాము తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎల్. దామోదరరావు కేసు నమోదు చేశారు.

గరివిడిలో వృద్ధుడి ఆత్మహత్య

గరివిడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గరివిడి టీచర్స్ కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ ఫేకర్ ఉద్యోగి గొడ్లమాన రామకృష్ణపరమహంస(70) మద్యంలో పురుగు మందు కలిపి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థుల కథనంమేరకు.. రామకృష్ణపరమహంస కుమారుడు, కుమార్తె విదేశాల్లో స్థిరపడడంతో మానసిక ఒత్తిడికి గురై మద్యానికి బానిసయ్యాడు.ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం మద్యంలోపువ్వుల మొక్కలకు కలిపే పురుగుల మందు కలిపి సేవించాడు. కొనఊపిరితో ఉన్నఆయన్ను స్థానికుల సహాయంతో భార్య సీతామహాలక్ష్మి చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ ఉపాధ్యాయిని...

నెల్లిమర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొయిద గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయిని విజయనగరం ప్రభుత్వాసుపత్రిలోచికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. గురువారం మనస్థాపానికి గురై నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. ఆమె గుర్ల మండలంలో ఓ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది.ఆమెకు భర్త, కుమారుడు ఉన్నారు. ఆమె భర్త కూడా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

కారు, బైక్ ఢీకొనడంతో ఒకరికి గాయాలు

రేగిడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడుబందల సమీపంలో శుక్రవారం కార్, బైక్ ఢీకొనడంతో వంగర మండలంలోని మగ్గూరు గ్రామానికి చెందిన చింతాడ భాస్కరరావుకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాజాం నుంచి వంగర వైపు కారు వెళ్తోంది. వంగర నుంచి ద్విచక్రవాహనంపై చింతాడ భాస్కరరావు ఆయన బంధువు చింతాడ అప్పలనాయుడు వెళ్తున్నారు. జోడుబందల సమీపంలో మలుపు వద్ద రెండు ఢీకొన్నాయి. దీంతో భాస్కరరావు గాయపడడంతో ఆస్ప త్రికి తరలించారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేశారు.

ఆరు మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):ముంజేరులో ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సీలు సత్యనారాయణ, ప్రతాప్, మహేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు

గజపతినగరం,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతశ్రీరంగరాజపురానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి ఎరుకరాజు అదృశ్యంకావడంపై ఆయన భార్య దుక్కా రామలమ్మ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె. కిరణ్‌కుమార్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. రెవెన్యూశాఖలో విధులు నిర్వహిస్తున్న రాజు మూడో తేదీన ఇంటి నుంచి విధులకు బయలు దేరివెళ్లారు.ఇప్పటివరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు ఇళ్లకి వెళ్లి ఆచూకీకోసం వెదికారు. అయినా రాజు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్త చేస్తున్నారు.

గుణిదాంలో ఇరువర్గాల కొట్లాట

చీపురుపల్లి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుణిదాంలో శుక్రవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో నలుగురికి గాయాలయ్యాయి. 30 సెంట్ల సరుగుడు తోట సర్వే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ కొట్లాటకు దారితీసింది. ఈ సంఘటనలో రెండు వర్గాలకు చెందిన గండబోయిన ఆదినారాయణ, రాజమ్మ, మన్మథరావు, గండబోయిన ఆదినారాయణ గాయపడ్డారు. గాయపడిన వారికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ఇరువర్గాల ఫిర్యాదుమేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ దామోదరరావు తెలిపారు. కాగాగతంలో వీరు ఇంటి స్థలం విషయంలో ఘర్షణ పడ్డారని, వీరిపై ఇప్పటికే కేసులు ఉన్నట్టు పోలీసులు చెప్పారు.

చాకుతో గాయపరిచిన వ్యక్తి అరెస్టు

కొత్తవలస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో చికెన్ కోసం స్నేహితుని చాకుతో గాయపరిచిన సూరిశెట్టి రవితేజను హత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. సీఐ కథనం మేరకు.. కొత్తవలస మంగళవీధిలో నివాసముంటున్న జంగంపల్లి ప్రసాద్, సూరిశెట్టి రవితేజ మద్యం సేవించారు. మద్యం మత్తులో ప్రసాద్ జేబులోని 100 రూపాయలను రవితేజ తీసుకుని చికెన్ కొనుక్కుని ఇంటికి తీసుకువెళ్లడంతో ఆ చికెన్ కోసం ప్రసాద్ రవితేజ ఇంటికి వెళ్లి తిరిగి తెచ్చుకున్నాడు. దీంతో కోపంతో రగిలిపోయిన రవితేజ ప్రసాద్‌ను చాకుతో పలు చోట్ల గాయపరచడంతో ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు బాధితుడు భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జంగంపల్లి ప్రసాద్‌పైకేసునమోదు చేశారు. శుక్రవారం అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు జుడీషియల్ కస్టడీలో ఉంచాలని న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు.

తండ్రి హత్యకేసులో నిందితుడు..

బాడంగి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):మద్యానికి బానిసై తండ్రి రాజేశ్వరరావును హతమార్చిన ఘటనలో కుమారుడు భువనగిరి లక్ష్మణరావును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. బాడంగిలో బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి విలేకరులతో మాట్లాడారు. నిందితుడు పరారయ్యేందుకు ప్రయత్నించగా పోలీసుల పిన్నవలస అడ్డురోడ్డు వద్ద అరెస్టుచేశారన్నారు. మద్యం తాగేందుకు తండ్రి రాజేశ్వరరావు డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో చాపలు కుట్టేందుకు ఉపయోగించే గూటం తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి బొబ్బిలి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఆమెతో పాటు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, ఎస్ఐ తారకేశ్వరరావు ఉన్నారు.

నేడు ఎయిర్‌పోర్టును పరిశీలించనున్న పీఎస్

భోగాపురం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ఇన్‌చార్జి ఇండస్ట్రియల్ ఇన్వెస్టుమెంట్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంపీ కృష్ణబాబు శనివారం సందర్శించనున్నారు.ఉదయం తొమ్మిది గంటలకు అమటంరాయవలస సమీప ట్రంపెట్‌ను, అనంతరం లింకురహదారులు, ఎయిర్‌పోర్టును పరిశీలించనున్నారు. ఆయనతో పాటు ఎయిర్‌పోర్టు డవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, కలెక్టర్ రాం సుందర్‌రెడ్డి పర్యటించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాం ఫీడర్ లైన్ నిర్వహణ పనుల దృష్ట్యా గొట్లాం, అంబటివలస, రోళ్లవాక, జీఎన్‌వలస, అయ్యన్నఅగ్రహారం, డోలపేట, రెడ్డిపేటల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ బి.రఘు తెలిపారు.

రేపు నేత్ర వైద్యశిబిరం

రాజాం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని భగవాన్ సత్యసాయిబాబా సత్యం మందిరంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం శంకర్ ఫౌండేషన్ వైద్యులు సారథ్యంలో నిర్వహించనున్నట్లు మందిరం కన్వీనర్ బసవరాజు తెలిపారు. కేటరాక్ట్ శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు పేర్కొన్నారు.

13న అప్రంటీస్‌షిప్ మేళా

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వీటి అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 13న ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్,అప్రంటీస్ అడ్వజర్‌టీవీగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు బయో డేటా ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో హాజరు కావాలని తెలిపారు.

సీఎంను కలిసిన బంగార్రాజు


సీఎంకు సమస్యలను వివరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడిని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు శుక్రవారం సచివాలయంతో కలిశారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించి పలు విషయాలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

శ్మశాన వాటికపై ఒప్పందం

కొత్తవలస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిక విషయంపై తరచూ రెండు గ్రామాల మధ్య జరుగుతున్న వివాదాలకు నేపథ్యంలో నాలుగు నెలలపాటు దహన సంస్కారాలు చేసుకోవడానికి ఒప్పందం కుదిరింది. అప్పన్నదొరపాలెం పంచాయతీలోని జోడుమెరక, తమ్మన్నమెరక మధ్య శ్మాశాన వాటికకు సంబంధించిన వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో అప్పన్నదొరపాలెం సర్పంచ్ జోడు రాములమ్మ, కార్యదర్శి సోమేష్ ఆధ్వర్యంలో జోడుమెరక, తమ్మన్న మెరక గ్రామాల పెద్దలసమక్షంలో చర్చలు జరిగాయి. ఈ మేరకు ఆరునెలలు సమయం ఇస్తే ప్రత్యామ్నాయంగా శశ్మానవాటికకు స్థలం చూసుకుంటామని జోడుమెరక గ్రామస్థులు ప్రతిపాదన చేశారు. ఇందుకు తమ్మన్న మెరక గ్రామస్థులు అంగీకరించక పోవడంతో చివరకు నాలుగునెలలు ఇవ్వడానికి అంగీకరించారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చే వినతులకు పాధాన్యంఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. శుక్రవారం విజయనగరం టీడీపీకార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన వినతులకు సంబంధించిన సమస్యలను దశలవారీగా ఆయా సమస్యల పరిష్కరించనున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని పినవేమలికి చెందిన వైసీపీ నాయకులు నక్కాన శ్రీను, అలబోను సాధురావు, అలబోను నారాయుడు, అలబోను సింహాచలంతో పాటు 50 కుటుంబాల టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, పినవేమలి టీడీపీ నాయకుల సమక్షంలో అదితి గజపతిరాజు వారిని పార్టీలోకి అహ్వానించారు.

గ్రామాల్లో నీటి సరఫరాపై నిలదీత

చీపురుపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఎక్కడున్నారో తెలియడం లేదని, గ్రామాల్లో నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని సభ్యులు నిలదీశారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, కరిమజ్జి శ్రీను, మీసాల వెంకటరమణ, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు తదితరులు గ్రామీణ నీటి సరఫరా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ సుజల ధార పథకం ద్వారా గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని నిలదీశారు. ట్యాంకుల వద్ద కంట్రోల్ వాల్వ్‌లు పాడయ్యాయని తెలియ జేసినా పట్టించుకొనే నాథుడేలేరని వాపోయారు. ఏవో సూర్యకుమారి మాట్లాడుతుండగా, సర్పంచ్‌లు, ఎంపీటీలు ఎరువుల సరఫరాపై ప్రశ్నించారు.శ్రీకాకుళం జిల్లాలో ఎరువుల సరఫరా సక్రమంగా జరిగిందని, ఇక్కడ ఎందుకు సకాలంలో ఎరువులు ఇవ్వలేకపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీడీవో ఐ. సురేష్, తహసీల్దార్ డి. ధర్మరాజు, డిప్యూటీ ఎంపీడీవో టి. ప్రవీణ్ పాల్గొన్నారు.

సెంచూరియన్ వర్సిటీకి గుర్తింపు


సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్

పర్లాకిమిడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం ప్రచురించిన ప్రతిష్ఠాత్మక ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో స్థానిక సెంచూరియన్ వర్సిటీకి గ్లోబల్ స్థాయిలో 1501వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు వచ్చిందని వర్సిటీ ఉపకులపతి సుప్రియ పట్నాయక్ తెలిపారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. పర్లాకిమిడిలో గల ఈ విశ్వవిద్యాలయం ప్రపంచ గుర్తింపులో ప్రత్యేకత సాధించిందని, బోధన, ఆవిష్కరణలు, పరిశోధనలో పెరుగుతున్న శ్రేష్ఠతను ప్రతిబింబిస్తుందన్నారు. నైపుణ్య, సమగ్ర సమ్మిళిత విద్యపై భారతదేశంలోని అత్యంత ప్రగతిశీల విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరొందడం గొప్ప విషయమన్నారు. దేశంలోని టాప్ 100 వర్సిటీల్లో ఒకటిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

కేజీహెచ్‌లో విద్యార్థినులకు పరామర్శ


విద్యార్థినులను పరామర్శిస్తున్న జగదీశ్వరి

కురుపాం/గుమ్మలక్ష్మీపురం అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేజీహెచ్‌లో పచ్చకామెర్లతో చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, గిరిజన సంఘ నాయకులు పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి, సీనియర్ వైద్యులతో మాట్లాడి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు, టీడీపీ మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్, బీజేపీఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహచలం,ఏఎంసీ వైస్ చైర్మన్ గార గౌరీశంకర్, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్, జనసేన కొమరాడ మండల కన్వీనర్ తెంటు శ్రీకర్, గరుగుబిల్లి జనసేన మడల కన్వీనర్ బోను శివ, శంకర్, అనంత్, రవి, శేఖర్, శంకరరావు, గోపాలకృష్ణ, హితేష్‌కుమార్, సుందరరావు పాల్గొన్నారు.

ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోండి


అటవీ అధికారులతో మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏనుగులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని లక్ష్మీనారాయణపురం గ్రామాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యే విజయచంద్రకు కోరారు. శుక్రవారం సాయంత్రం ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఏనుగులు తమ ప్రాంతం నుంచి తరలించే విధంగా చూడాలన్నారు. అదే విధంగా లక్ష్మీనారాయణపురం, చొక్కాపువానివలస మధ్య ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజలతో పాటు స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని, త్వరలో పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

గోమాంసం విక్రయంపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోగోమాంసం అమ్మకాలపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న విజయనగరం తహసీల్దార్‌పై ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉండాలని ఏపీగోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జీవ బంధు లోగిశ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ జీవో -44 అనుసరించి మండల జంతు సంక్షేమ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న తహసీల్దార్ ఎటువంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో గోసంరక్షణ సమాఖ్య మహిళా నాయకులు గండికోట శాంతి, నీలాపు దేవి, తాలాడ పైడిరాజు, జలగడుగుల మల్లిక, సోము మందాకిని, భీమపల్లి సంధ్యారాణి, కరిపి శిరీష, దాసరి నాగలక్ష్మి, బంకపల్లి లక్ష్మి దుర్గ పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు వసూళ్లు: బొత్స

విజయనగరం దాసన్నపేట అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):విజయనగరం ఉత్సవాలకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో హుండీలు ఏర్పాటు చేశారని, ఉత్సవాల ఖాతాకు నగదు పంపాలని అధికారులను అదేశించారని, దీంతో ఏమీ తోచక అధికారులు ఉత్సవాల నిర్వహణకు వసూళ్లుచేశారని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యానారాయణ ఆరోపించారు. పైడి తల్లమ్మ సిరిమానోత్సవం పురస్కరించుకుని తాము సిరిమాను తిలకించేందుకు ఏర్పాటుచేసిన వేదిక కూలిపోయిన ఘటనలో పైడితల్లి ఆశీసులు ఉండబట్టి బతికి బయటపడ్డామని, లేకుంటే ఏమయ్యేదోనని పశ్నించారు. శుక్రవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ కనీసం ప్రతిపక్షనేతగా తనకు ప్రోటోకాల్ పాటించలేదని ఆరోపించారు. శాసనమండలి చైర్మన్‌కు కూడా ఫిర్యాదు చేస్తానన్నారు. తనను అవమానించి అంతమొందించాలని కుట్ర పన్నారా అని ప్రశ్నించారు.ఈ విషయంపై జిల్లా అధికారులు సమధానం చెప్పాలని డిమాండ్‌చేశారు.తమ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ ఓ మహిళకు కూడా గాయాలయ్యాయని తెలిపారు. అధికారులు కనీస ధర్మంగా పరామర్శించలేదని ఇదేనా కలెక్టర్, ఎస్పీ బాధ్యత అని ప్రశ్నించారు. దీన్ని ఇంతటితో వదిలి పెట్టనని గవర్నర్, సీఎస్‌కు లేఖ రాస్తానని బొత్స చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ముగ్గురికి ఆరునెలల జైలు

గరివిడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):గరివిడి పోలీసు స్టేషన్ పరిధిలో 2021 జూలై 19న కొండపాలెం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురికి కోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది.ఎస్ఐ లోకేశ్వరరావు కథనం మేరకు.. అప్పట్లో ఈ కేసును ఎస్ఐ పి.నారాయణరావు దర్యాప్తు నిర్వహించి చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ప్రస్తుతం ఎస్ఐ బి.లోకేశ్వర రావు, కోర్టు పోలీసు జీఎల్ నాయుడు సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ న్యాయవాది బి.సతీష్ వాదనలు వినిపించారు. చీపురుపల్లి జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.బుజ్జి ఈ కేసులో నిందితులు మంచాల పైడిరాజు, పెద్దకాపు శ్రీను, గడపర్తి ఆదినారాయణలకు ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

గుర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరికి జీఎస్టీపై అవగాహన అవసరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని కెల్ల గ్రామంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సెక్సెస్ కార్యక్రమంలో భాగంగా వ్యాపారులు, రైతులు, దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, గోవిందు, పైడినాయుడు పాల్గొన్నారు.

స్పేస్ టెక్నాలజీలో భారత్ సత్తా

- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు



షార్ ప్రాజెక్టు డైరెక్టరుకు జ్ఞాపికను అందజేస్తున్నసుజయ్‌కృష్ణ రంగారావు

బొబ్బిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్పేస్ టెక్నాలజీలో భారత్ సత్తా చాటుతోందని మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా స్థానిక రాజా కళాశాలలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికాపై ఆధారపడే పరిస్థితుల నుంచి మన దేశం గట్టెక్కేస్థితికి చేరుకుందన్నారు. ఇస్రో, షార్ కార్యకలాపాలు దేశానికి మంచి ప్రతిష్ఠను, కీర్తిని తెచ్చిపెట్టాయన్నారు. శ్రీహరి ర్యాకెట్ ప్రయోగకేంద్ర సందర్శనకు శాస్త్రవేత్తలు ఆహ్వానించడం మంచి పరిణామమని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వహించిన పలు రకాల పోటీలలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. విద్యార్థులు కోలాటం, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. షార్ మూడో లాంచ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్ర కుమార్, షార్‌కు చెందిన కార్యక్రమంనిర్వాహక కమిటీ చైర్మన్ టి.హరికృష్ణ, కార్యదర్శి ఇ. ప్రదీప్ నాయుడు, కళాశాల జాయింట్ డైరెక్టరు రావు బదరి, అధ్యాపకులు, షార్ సిబ్బంది, అనేక కళాశాలలు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

బెలగాం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. పోలీసుల నుంచి ఎస్పీ వినతులను స్వీకరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చినమంగళాపురం విద్యార్థులు

పాలకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):జిల్లాస్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో చినమంగళాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్-17 విభాగంలో సాఫ్ట్‌బాల్ టెన్నీస్‌కు తొమ్మిదో తరగతి విద్యార్థి పాలవలస అరుణ్, అండర్-14 విభాగంలో క్రికెట్‌కు ఎనిమిదో తరగతి విద్యార్థి జస్వంత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

బాణసంచాతో తస్మాత్ జాగ్రత్త!

(5వ పేజీ తరువాయి)

ఉంచాలి. వాస్తవానికి జిల్లాలో ఎక్కడా ఈ పరిస్థితులు కనిపించడం లేదు. పర్మినెంట్ షాపుల వద్ద స్ప్రింకర్లు కాదుకదా అగ్నిప్రమాద పరికరాలు కూడా కనిపించడం లేదు. ఇసుక బకెట్లు కూడా లేని పర్మినెంట్ గోడౌన్లు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. పరిమితికి మించి మందుగుండు సామగ్రిని నిల్వ చేస్తున్నారు. ఏటా రెన్యువల్ చేయించే విషయంలో కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు నిర్వహించాలి

జిల్లాలో కొంతమంది ముడిసరుకు తెచ్చి, మూడోకంటికి తెలియకుండా అనధికారికంగా బాణసంచా తయారుచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అనుమతులు లేకుండా గోడౌన్లలో నిల్వ ఉంచి పండుగలు, పర్వదినాలు, జాతర్ల సమయాల్లో జోరుగా అమ్మకాలు చేస్తున్నారు. గంధకం, సురాకారం తదితర ముడిసరుకు అమ్మకాలు చేసే వ్యాపారులపై కూడా జిల్లా యంత్రాంగం ఓ కన్నేయాల్సి ఉంది. నిబంధనలు అమలు, బాణసంచా నిల్వలు, లైసెన్స్‌ల గడువు, కొనుగోలుకు సంబంధించిన వివరాలు తదితర అంశాలపై జిల్లా విపత్తులు, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖలు తనిఖీలు నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ నిబంధనలు తప్పనిసరి..

● నివాసాలకు దగ్గరగా తాత్కాలిక, శాశ్వత బాణసంచా విక్రయ షాపుల ఏర్పాటుకు పోలీసులు అనుమతులు ఇవ్వకూడదు. ● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో, హైటెన్షన్ విద్యుత్ తీగలకు కింద దుకాణాలు పెట్టకూడదు. ●ఊరికి ఆవల ఏర్పాటయ్యేలా అధికారులు చూడాలి. ● దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలి. ● పొగ తాగరాదనే బోర్డులు ఏర్పాటు చేయాలి. నీటి సదుపాయం కల్పించాలి. ● డ్రై కెమికల్ పౌడర్ నాలుగైదు కిలోలు, సీఓటూ (కార్బన్ డై ఆక్సైడ్) ఐదుదు కిలోలు దుకాణం వద్ద ఉండేలా చూడాలి. ● నిబంధనలకు మించి నిల్వలు ఉంచకూడదు. ● చిన్నపిల్లలను పనిలో పెట్టుకోకూడదు. ●అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచాలి.

తవ్వుకో.. తరలించుకో!

(5వ పేజీ తరువాయి)

స్థలాలను కబ్జా చేస్తున్నారు. చెరువులు, గెడ్డలు, కొండలు, గుట్టలు, చివరకు శ్మశానవాటిక స్థలాలకు సైతం రక్షణ లేకుండా పోతుంది. ముందుగా మట్టి, గ్రావెల్ తవ్వకాల రూపంలో అక్రమార్కులు ఎంట్రీ ఇస్తున్నారు. తరువాత చేతికి పని చెబుతున్నారు. రాజకీయ, అధికార పలుకుబడితో దొంగ పట్టాలు సృష్టిస్తున్నారు. బలవంతంగా వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాజకీయ నేతల ప్రోత్సాహంతో కబ్జాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొగిలివలస గ్రామ పరిధిలోని ఎరుకవాని చెరువు గతంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుతం ఈ చెరువు ఆనవాళ్లు కోల్పోతుంది. ఇక్కడ సెంటు ధర రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు పలుకుతుండడంతో అక్రమార్కుల కన్ను ఈ చెరువుపై పడింది. ఎకరాకు పైగా ఆక్రమణకు గురైనట్టు తెలుస్తోంది. చెరువు గర్భం ఆక్రమణకు గురవుతుండడంతో వంద ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇప్పటికైనా రాజాం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న చెరువులు, సహజ సిద్ధ వనరులను అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

అక్రమ మైనింగ్ నేరం. చెరువులు, ఇతర ప్రభుత్వ స్థలాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సిబ్బందిని అప్రమత్తం చేశాం. అన్ని గ్రామ పంచాయతీల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశాం. అవసరమైతే క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తాం. చెరువులు వద్ద సూచిక బోర్డులు పెడతాం.

-ఎం.రాజశేఖర్, తహసీల్దార్, రాజాం

అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలుంటాయా?

(5వ పేజీ తరువాయి)

కనెక్షన్లు ఉన్నవారు మాత్రం రూపాయి కూడా చెల్లించడం లేదు. కొందరు కుళాయిలకు విద్యుత్ మోటార్లను అమర్చి యథేచ్ఛగా నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. కుళాయిలకు నీటిని వదిలినప్పుడు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయించాలని గతంలో పాలకులు తీర్మా నం చేశారు. కానీ, అది ఆచరణలో సాధ్యం కాలేదు. ఫలితంగా నీటి చౌర్యం యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

అప్పుడు డిమాండ్ చేసి.. ఇప్పుడు వద్దని

ఇటీవల రెండు ప్రధాన పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ఏకాభిప్రాయంతో ముందుకొచ్చి అక్రమ కుళాయి కనెక్షన్లను ప్రభుత్వ నిబంధన ప్రకారం క్రమబద్ధీకరించి, వాటికి అసెస్‌మెంట్ నెంబర్లను కేటాయించాలని, తద్వారా నెలవారీ కుళాయి పన్నులు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోబోమని, కుళాయిల రెగ్యులైజేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాలని కోరారు. అయితే, ఇప్పుడు కొంతమంది కౌన్సిలర్లు ఈ వ్యవహారంపై సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి కుళాయి రెగ్యులరైజేషన్ ఫీజును రూ.12 వేలు కాకుండా అందులో సగం లేదా రూ.7వేలు చొప్పున వసూలు చేయాలని పట్టుబడుతున్నారు. మరో మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నిక నగారా మోగుతుందన్న వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో కౌన్సిలర్లు తమ స్వరాన్ని మార్చినట్లు విమర్శలు వస్తున్నాయి. అనధికార కుళాయిలపై చర్యలు తీసుకుంటే అలాంటి వారి ఓట్లు పోతాయేమోనన్న భయం వారికి పట్టుకుంది. పట్టణంలోని 300 అక్రమ కుళాయిలను రెగ్యులరైజేషన్ చేసేందుకు రూ.12 వేలు చొప్పున వసూలు చేస్తే ఒకేసారి మునిసిపాలిటీకి రూ.36 లక్షల మేర ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అలాగే నెలవారీ ఆదాయం కూడా పెరుగుతుంది. మరి మునిసిపల్ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

జీవోకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోలేం

అక్రమ కుళాయిల కనెక్షన్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఇచ్చిన జీవోకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేము. ఒక్కో కనెక్షన్ క్రమబద్ధీకరణకు రూ.12 వేలు వసూలు చేయాలని జీవోలో ఉంది. కొంతమంది కౌన్సిలర్లు చేసిన ప్రతిపాదన మేరకు ఆ మొత్తాన్ని తగ్గించేందుకు మాకు ఎటువంటి అధికారం లేదు. దీనిపై చైర్మన్, ఇతర అధికారులతో చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటాం.

-లాలం రామలక్ష్మి, మునిసిపల్ కమిషనర్, బొబ్బిలి

కళ్లు మూసుకున్నారా.. లక్షలు తీసుకున్నారా?

(5వ పేజీ తరువాయి)

ఆన్‌లైన్ చేసేశారు. అప్పలనర్సమ్మ పేరును మాత్రం చేర్చలేదు. ఈ విషయం తెలియడంతో కొయ్య అప్పలనర్సమ్మ, కుటుంబీకులు స్థానిక రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. తహసీల్దార్ లేకపోవడంతో వీఆర్వోలతో మాట్లాడారు. ఏవిధంగా ఆన్‌లైన్ చేస్తారు కళ్లు మూసుకున్నారా, ఎంత తీసుకున్నారంటూ వీఆర్వోలపై విరుచుకుపడ్డారు. సుమారు గంటన్నర పాటు కార్యాలయం హోరెత్తి పోయింది. కార్యాలయ ఆవరణలో అప్పలనర్సమ్మ, పోలమ్మ కుటుంబీలు బాహాబాహీకి దిగారు. దీనిపై మునగల రమణ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ కోసం అప్పలనర్సమ్మను రావాలని చెప్పినా రాలేదన్నారు. వారి భూమి వారికి ఇచ్చేస్తామని తెలిపాడు. కాగా, ఎఫ్‌సీవోలో పేరు ఉన్న వారికి తెలియ కుండా, ఎటువంటి విచారణ చేయకుండా, ఎటువంటి పత్రాలు లేకుండా అనుభవంలో ఉన్న వ్యక్తుల పేరున భూమిని ఆన్‌లైన్ చేయడంపై రెవెన్యూ సిబ్బందిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పారిశుధ్య కార్మికులతో సహపంక్తి భోజనం

●కార్మికులు, శానిటరీ సిబ్బందికి ఎమ్మెల్యే సత్కారం



కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో శుక్రవారం ఎమ్మెల్యే బేబీనాయన పారిశుధ్య కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా ఆయన కార్మికులకు స్వయంగా వడ్డించారు. ఈ నెల 6 విజయవాడలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బొబ్బిలి మున్సిపాలిటీ స్వచ్ఛ మున్సిపాలిటీగా రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విషయం తెలిసిందే. ఆ అవార్డును పురస్కరించుకుని ఎమ్మెల్యే.. పారిశుధ్య కార్మికుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలుత కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, శానిటరీ సూపర్‌వైజర్లు, సచివాలయం శానిటేషన్ ఉద్యోగులను ఎమ్మెల్యే సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ మున్సిపాలిటీగా బొబ్బిలికి ప్రథమస్థాయి అవార్డు రావడం వెనుక పారిశుధ్య కార్మికులందరి శ్రమ ఎంతో ఉందన్నారు. ఈ అవార్డును కార్మికులంతా కలిసి బొబ్బిలి ప్రజలకు బహుమానంగా ఇచ్చినట్టు భావించాలన్నారు. కోవిడ్ సమయంలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్ట లేనిదని గుర్తు చేశారు. అలాంటి గడ్డురోజుల్లో పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఇప్పుడు మళ్లీ వారి కారణంగా అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని సహపంక్తి భోజనం చేశానన్నారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూ బేబీనాయన మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న కాలంలో ప్రారంభించిన అనేక కార్యక్రమాలు మున్సిపాలిటీని అగ్రభాగాన నిలబెట్టాయన్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ కరుణాకరం ప్రసాద్ ఎంతో సాహసోపేతంగా ఇంటింటా చెత్తసేకరణ, ప్లాస్టిక్ నిషేధం, చెత్త నుంచి ఎరువుల తయారీ వంటి వాటికి విప్లవాత్మకంగా శ్రీకారం చుట్టారన్నారు. ఎమ్మెల్యే బేబీనాయన సహకారంతో అద్భుతమైన ఫలితాలు సాధించి పలు జాతీయ అవార్డులను దక్కించుకోగలిగామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు వెలగాడ హైమావతి, కింతలి శ్రీదేవి బంగార్రాజు, సాలా స్వప్న, దిబ్బ సునీత, బొత్స సురేష్, కె.సత్యనారాయణ, కాకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టారా?

● రోడ్డు మలుపులో తరచూ ప్రమాదాలు



ఎం.బూర్జవలస రహదారిలో పిచ్చిమొక్కలతో మలుపు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గున్నతోటవలస-ఎం.బూర్జవలస రహదారిలో మలుపు ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడమే ఇందుకు కారణం. పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించే వీలులేకుండా పోతోంది. పైగా మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇదే మలుపులో ఆటో, బైకు ఢీకొని ఇద్దరు గాయాలపాలయ్యాయారు. కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడం వల్ల రాత్రిళ్లు ఈ రోడ్డులో ప్రయాణించడం కష్టమే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద జంగిల్ క్లియరెన్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

జీఎస్టీ 2.0పై అవగాహన

బాడంగి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జీఎస్టీ 2.0 సూపర్ సేవింగ్స్‌పై ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గుదలను వివరించారు. ఎయిర్ కండీషన్‌పై సుమారు రూ.2,800, టీవీలపై రూ.3500 వరకూ తగ్గిందని చెప్పారు. ఇతర వస్తువుల ధరలు కూడా తగ్గాయన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి

బాడంగి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎస్.తవిటి నాయుడు శుక్రవారం తనిఖీ చేశారు. కళాశాలలో వసతులను పరిశీలించారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడియత్నం అమానుషం

లక్కవరపుకోట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమని సీపీఎం జిల్లా నాయకుడు గాడి అప్పారావు పేర్కొన్నారు. శుక్రవారం ఎల్.కోటలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు తరిని వెంకటరమణ పాల్గొన్నారు.

●గజపతినగరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై బూటు విసిరి దాడికి యత్నించిన లాయర్ కిషోర్‌ను శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీని వాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జయంతికాలనీలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసరి సింహాద్రి, బి. కనకరాజు, గోవింద, కోటి, పైడిరాజు పాల్గొన్నారు.

●భోగాపురం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సీజేఐ గవాయిపై జరిగిన దాడి యత్నానికి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బి.సూర్యనారాయణ, అప్పారావు రాము పాల్గొన్నారు.

58 పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తాం

మెరకముడిదాం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని ఆర్ఎస్‌కేల పరిధిలో 2025-26ఖరీఫ్ సీజన్‌కుగానూ వరిపంటకు సంబంధించి 58 పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తామని ఏవో శ్రావణి తేజ తెలిపారు. శుక్రవారం మెరకముడిదాంలో 18 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గల వీఏఏలు, వీహెచ్ఎస్‌లు, ఎంపీఈవోలు, ఏఈవోలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటకోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో సంతోష్‌కుమార్, ఏఐసీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్.గోపిరాజు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచేలా కృషి చేయాలి

రాజాం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధికి ఆదాయ వనరులు పెంచేలా సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో జె.ఆనందరావు కోరారు. శుక్రవారం రాజాం మండల పరిషత్ ఆవరణలో శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. అనంతరం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రామభద్రపురం విద్యార్థి



మణికంఠ

రామభద్రపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఒమ్మి మణికంఠ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ బి.శ్రీదేవి తెలిపారు. ఇటీవల విజయనగరం విజ్జి స్టేడియంలో నిర్వహించిన 200 మీటర్ల పరుగుపందెంలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు వంగపండు గోపాలనాయుడు, పీఈటీ బెవర రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బొబ్బిలి-తెర్లాం రోడ్డుకు మోక్షం

బొబ్బిలి, అక్టోబరు 10 అంధ్రజ్యోతి): బొబ్బిలి-తెర్లాం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. బొబ్బిలి నుంచి వయా రేజేరు మీదుగా తెర్లాం రోడ్డులో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడేవారు. దాంతో ఆ రోడ్డు విషయమై ఎమ్మెల్యే బేబీనాయన దృష్టిసారించారు. అసెంబ్లీలో పలు దఫాలు రోడ్ల సమస్యలపై చర్చించారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం బొబ్బిలి -తెర్లాం రోడ్డుకు రూ.4.50 కోట్లను మంజూరు చేసి టెండర్లను ఖరారు చేసింది. శనివారం రోడ్డు పనులకు ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ లక్ష్మునాయుడు శంకుస్థాపన చేపట్టనున్నారని ఆర్అండ్‌బీ ఏఈ బీపీ రాజు తెలిపారు.

ఘనంగా బాలికా దినోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్ఎం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు, డిబేట్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాలికల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. వారి హక్కుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. బాలికల హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి బాలికా దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభచాటిన బాలికలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవండి

రామభద్రపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంగపండు గోపాలనాయుడు సూచించారు. మండల కేంద్రంలోని చొక్కాపువీధి, కనిమెరకవీధి, పూడివీధుల్లో శుక్రవారం రాత్రి విద్యార్థుల ఇంటికి హెచ్ఎం వెళ్లారు. వారు ఎలా చదువుతున్నదీ పరిశీలించి తల్లిదండ్రులతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ఏకాగ్రతతో చదవాలన్నారు. హోంవర్కులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు.

మానసిక ఆరోగ్య సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి

బొబ్బిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక న్యాయాధికారి ఎం.రోహిణీరావు పాల్గొని మాట్లాడారు. మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడానికి, వాటి పరిష్కారానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాలను సమీకరించడానికి ఉద్దేశించినదే మానసిక ఆరోగ్య దినోత్సవమన్నారు. మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం, వారికి నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యమన్నారు. లక్ష్యాల సాధన కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వమే కళాశాలలను కొనసాగించాలి



సంఘీభావం తెలుపుతున్న ప్రతినిధులు

బొబ్బిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలను కొనసాగించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో శుక్రవారం సాయంత్రం జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పోల సత్యంనాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శివానంద్ మాట్లాడుతూ వైద్యరంగం నుంచి తప్పుకునేందుకు ప్రభుత్వం పీపీపీ పేరుతో కుట్ర పన్నుతోందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకురాలు విజయగౌరి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్యను దూరం చేసే చర్యను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు, ఏపీటీఎఫ్ నాయకులు ధనుంజయ్, దాసరి వెంకటనాయుడు తదితరులు మాట్లాడుతూ కళాశాలను ప్రైవేట్‌కు అప్పగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అనుమతి తప్పనిసరి

రామభద్రపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా విక్రయాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ వెలమల ప్రసాదరావు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాత్కాలిక లైసెన్స్ తీసుకున్నప్ప దీపావళి పండుగకు మూడు రోజుల ముందు మాత్రమే బాణాసంచా విక్రయించాలన్నారు. అక్రమంగా బాణ సంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లో రౌడీ యాక్టివిటీస్ చేపట్టిన వారికి శిక్ష తప్పదన్నారు. అటువంటి వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు. చేయడంతగదన్నారు. ఎవరి మనోభావాలను కించపరచరాదన్నారు. ప్రతీ ఒక్కరూ శాంతి భద్రతలకు విఘాతం కలగనీయరాదన్నారు.

బోధనేతర బాధ్యతలను అప్పగించవద్దు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలను అప్పగించవద్దని ఫ్యాప్టో జిల్లా నాయకుడు కె.జోగారావు అన్నారు. శుక్రవారం బోధనేతర బాధ్యతల బహిష్కరణ సందర్భంగా కొయ్యకొండవలస పాఠశాలలో ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల బోధనకు సమయం లేకుండా పోతోందన్నారు. ఈ విషయం పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ ప్రభుత్వ స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో మండల నాయకులు వి.రాజేష్, వై.పైడిరాజు, ఆర్.పోలినాయుడు, సిహెచ్.సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఎంఈవో-2కు మెమొరాండం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

●రామభద్రపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను అప్పగించడం వల్ల బోధనా సమయం హరించుకుపోతోందని ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు జేసి రాజు అన్నారు. శుక్రవారం ఎంఈవో-2 పెంటయ్యకు డిమాండ్లతో కూడిన వినతిపత్రానిన అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు బొప్పే రవికుమార్, ప్రసన్నకుమార్, శంకరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే చేపడతామన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఫ్యాప్టో తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో భక్తదర్శన్, సీహెచ్.జీ.శర్మ, గణేష్, అప్పారావు, కర్రి శ్రీనివాసరావు, రామారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ చేయడం గొప్పవిషయం

● న్యాయాధికారి కె. శారదాంబ

రాజాం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయమని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సంతోషి మనో వికాసకేంద్రం (చెవిటి, మూగ, మానసిక వికలాంగుల పాఠశాల)లో ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మనో వికాసకేంద్రం నిర్వాహకుడు నాగభూషణరావు, రాజాం సామాజిక ఆసుపత్రి వైద్యులు షణ్ముఖ శ్రీనివాస్, వికాసతరంగిణి సెంట్రల్ కమిటీ సభ్యులు రమణమూర్తి పాల్గొన్నారు.

●దత్తిరాజేరు: కోరపు కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంజేపీ బీసీఆర్ స్కూల్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి తనీషా సుబ్బారాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గిరిబాబు, ఎంపీహెచ్ఈవో మురళీ, హెచ్ఎం మాధవి ఉన్నారు.

●గజపతినగరం: మానసిక వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమతో మెలగాలని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

●ఎస్.కోట రూరల్: ఎదుగుతున్న పిల్లల్లో మానసిక ఆరోగ్యం ముఖ్యమని జిల్లా మానసిక ఆరోగ్యకౌన్సిలర్ ఇప్పిలి శైలజ తెలిపారు. ఎస్.కోట బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాల, కిల్తంపాలెం నవోదయలో ప్రపంచ మానసిక ఆరోగ్యదినోత్సవం నిర్వహించారు.

ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి

గజపతినగరం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బి.రత్నకుమార్ తెలిపారు. శుక్రవారం గజపతినగరం రైతు సేవాకేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 వరకు ఈ-కేవైసీ నమోదు చేసుకునేందుకు అవకాశముందని తెలిపారు. ఈ సందర్భంగా దానివల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతుల ప్రయోజనార్థం అమలు చేస్తున్న ప్రక్రియను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ వాయిదా



ఆందోళన చేస్తున్నరైతులు

సంతకవిటి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చిత్తారపురంలో యూరియా పంపిణీని శుక్ర వారం వాయిదా వేశారు. ఇక్కడ సచివాల యా నికి 20 టన్నుల యూరియా వచ్చింది. దాని కోసం రైతులు సచివాలయానికి చేరుకున్నారు. యూరియా సక్రమంగా పంపిణీ చేసేందుకు పోలీసులు కూడా అక్కడకి చేరుకున్నారు. సచివాలయానికి వచ్చిన 444 యూరియా బ స్తాల పంపిణీ మొదలుపెట్టారు. ఆ సమయం లో అక్కడ ఉన్న చిత్తారపురంలో సచివాలయం పరిధిలోని పోడలి, గారన్నాయుడుపేట, గుజ్జి న్నపేట రైతులు కాకుండా బూరాడపేట, పనస పేట, వాల్తేరులోని రైతులు చేరుకున్నారు. తమ కూ యూరియా కావాలని కోరడంతో అధికారులు ఒక్కో బస్తా చొప్పున అందిస్తామని చెప్పినా వినకపోవడంతో పంపిణీని అధికారులు వాయిదా తెలిపారు.